బస్టాండు ప్రాంగణంలో మురుగు తిష్ట

- పట్టణంలోని డ్రెయినేజీ మురుగు బస్టాండు ప్రాంగణంలోకే
- దుర్గంధంతో ప్రయాణికుల ఇక్కట్లు
- మల,మూత్ర విసర్జన అంతా బహిరంగంగానే
- బస్టాండు నిర్వహణ అస్తవ్యస్తం
- వ్యాధుల భయంతో జనం బెంబేలు



మురుగుతో నిండిపోతున్న బస్టాండు ప్రాంగణం



డ్రెయిన్ నుంచి పొంగుతున్న మురుగు

కంకిపాడు: కంకిపాడు బస్టాండు. సుమారు 40 గ్రామాలకు ప్రధాన కూడలి.. విజయవాడ తరువాత వచ్చే ప్రధాన బస్టాండు ప్రాంగణాల్లో కీలకమైంది. ఇలాంటి బస్‌స్టేషన్‌పై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం, శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగా ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. మురుగుతో ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. అసలే వర్షాకాలం కావడంతో పొంచి ఉన్న వ్యాధుల భయంతో బెంబేలెత్తిపోతున్నారు. ఉయ్యూరు ఆర్టీసీ డిపో పరిధిలోని కంకిపాడు బస్టాండుకు నిత్యం విజయవాడ, మచిలీపట్నం, అవనిగడ్డ, భీమవరం, గన్నవరం ప్రాంతాలకు వందలాది సర్వీసులు నడుస్తున్నాయి. విజయవాడ తరువాత వచ్చే ముఖ్యమైన జంక్షన్ కేంద్రాల్లో కంకిపాడు అతి ముఖ్యమైంది. ఇటు గన్నవరం, గుడివాడ, భీమవరం ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులతో పాటుగా జిల్లా కేంద్రమైన మచిలీపట్నం, అవనిగడ్డ ప్రాంతాలకు ప్రయాణికులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. గన్నవరం, ఉంగుటూరు, తోట్లవల్లూరు, కంకిపాడు, పెనమలూరు మండలాలకు చెందిన ప్రయాణికులు కంకిపాడు కేంద్రంగానే గమ్యస్థానాలకు చేరుతుంటారు. అంతకు మించి 40 గ్రామాలకు కూడలి కావడంతో నిత్యం ప్రజలు బంగారు, వస్త్ర, ఇతర వ్యాపార అవసరాలు, కుటుంబ అవసరాల నిమిత్తం కంకిపాడుకు వచ్చి పోతుండటం గమనార్హం.

బస్టాండు పరిసరాలను చూస్తేనే హడల్

గమ్యస్థానాలు చేరుకోవటానికి బస్టాండుకు వచ్చే ప్రయాణికులు ప్రాంగణాన్ని చూసి హడలెత్తిపోతున్నారు. ప్రధానంగా పట్టణంలోని ప్రధాన డ్రెయినేజీ వ్యవస్థ కంకిపాడు బస్టాండు ముఖద్వారం నుంచి ప్రవహిస్తోంది. ఇక్కడ ఏర్పాటు చేసిన సిమెంటు తూములు ఇటీవల ధ్వంసమయ్యాయి. దీంతో పగుళ్లువారిన తూముల నుంచి డ్రెయినేజీ మురుగు పొంగి పొర్లుతోంది. పొర్లిన మురుగు నేరుగా బస్టాండు ప్రాంగణాన్ని ముంచెత్తుతోంది. మురుగుతో బస్టాండులోకి వచ్చి పోయే ప్రయాణికులు దుర్గంధం భరించలేక అవస్థలు పడుతున్నారు. మురుగు నుంచి నడిచి బస్సులు ఎక్కలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు అడపా దడపా కురుస్తున్న వర్షాలు సమస్యను తీవ్రం చేస్తున్నాయి. చిన్న పాటి వర్షం కురిసినా ప్రాంగణం అంతా చిన్నపాటి చెరువును తలపిస్తోంది. రోజుల తరబడి మురుగు కదలటం లేదు. దీంతో ఇక్కట్లు ఎదుర్కొంటూనే ప్రయాణికులు గమ్యస్థానాలకు చేరుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

పొంచి ఉన్న వ్యాధుల భయం

మురుగు నిత్యం బస్టాండులోకి చేరడం, వర్షాలకు జలమయంగా తయారవ్వడంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. దోమలు, ఇతర చర్మ వ్యాధులు విజృంభించే ప్రమాదం ఉందని భయపడుతున్నారు. వ్యాధుల భయం పొంచి ఉండటంతో బస్టాండులోకి వెళ్లాలంటేనే ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు బస్టాండులో మురుగుదొడ్లు ఉన్నా కొందరు బస్టాండు ప్రాంగణం, పరిసరాల్లోనే బహిరంగ మల, మూత్ర విసర్జనకు పాల్పడుతున్నారు. దీంతో వ్యాధులు విజృంభించే ప్రమాదం ఉందని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.

కన్నెత్తి చూడని అధికారులు

సమస్య తీవ్రత అధికమవుతున్నా అటు ఆర్టీసీ అధికారులు కానీ, ఇటు పంచాయతీ అధికారులు కానీ స్పందించడం లేదు. నేరుగా మురుగు బస్టాండును ముంచెత్తుతున్నా పట్టించుకోవడం లేదు. అధికారుల మధ్య సమన్వయం లోపం కారణంగా ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. బస్టాండులోకి మురుగు చేరకుండా శాఖాపరమైన చర్యలకు అధికారులు ఉపక్రమిస్తారో? లేదో? వేచిచూడాల్సిందే.

క్లుప్తంగా

ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులు బ్యాంక్ ఖాతాలు తెరవాలి

కంకిపాడు: 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులు బ్యాంకు ఖాతాలను తెరవాలని సాంఘిక సంక్షేమ శాఖ ఉయ్యూరు డివిజన్ సహాయ సాంఘిక సంక్షేమ అధికారి బి.మోహన్‌రావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న ఎస్సీ సామాజిక విద్యార్థులకు తల్లికి వందనం పథకం కింద ఈనెల 10న సొమ్ము జమ అవుతుందన్నారు. ఎస్సీ విద్యార్థులు తమ బ్యాంకు ఖాతాకు ఆధార్ అనుసంధానం చేసుకోవడం, బ్యాంకు ఖాతాలు లేని వారు పోస్టాఫీసుల్లో బ్యాంకు ఖాతాలను తెరిచి ఆధార్ అనుసంధానం చేసుకోవాలని సూచించారు.

చెత్త సేకరణ ట్రక్కు ప్రారంభం



కేసరపల్లి(గన్నవరం): కేసరపల్లి పంచాయతీ కార్యాలయంలో శనివారం కొత్తగా తయారు చేయించిన చెత్త సేకరణ ట్రక్కును సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీమౌనిక ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ చెత్త సేకరణకు గ్రామ పంచాయతీ నిధులతో ఎక్కువ సామర్థ్యంతో కూడిన ట్రాక్టర్ ట్రక్కును తయారు చేయించామని చెప్పారు. సచివాలయ, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

శాకంబరిగా సరస్వతీదేవి



దావాజీగూడెం(గన్నవరం): దావాజీగూడెంలోని సీతారామచంద్రస్వామి దేవస్థానంలో శనివారం అషాఢ మాసం శుద్ధ దశమి సందర్భంగా శాకంబరీ ఉత్సవాలు నిర్వహించారు. ఉపాలయంలోని సరస్వతిదేవి అమ్మవారిని, ఆలయ ప్రాంగణాన్ని వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలు, పండ్లతో అందంగా అలంకరించారు. ఆలయ అర్చకులు ఎస్. రామాచార్యులు నేతృత్వంలో 300 మంది సువాసినులచే సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు కదంబం ప్రత్యేక ప్రసాదం, కూరగాయలను అందజేశారు.

8 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



కంకిపాడు: ఓ పిండిమరలో అక్రమంగా నిల్వచేసిన ఎనిమిది క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు శనివారం గుర్తించారు. కంకిపాడు పట్టణానికి చెందిన బవిరిశెట్టి శ్రీనివాసరావు పిండిమరలో రేషన్ బియ్యం ఉన్నట్లు ఓ వ్యక్తి ఫోన్ చేసి సివిల్ సప్లయిస్ డెప్యూటీ తహసీల్దార్ ప్రదాన్‌కు సమాచారం అందించారు. ప్రదాన్ సూచనల మేరకు వీఆర్ఓ రఘురాంప్రసాద్ సంబంధిత పిండిమరలో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో ఎనిమిది క్వింటాళ్ల రేషన్ బియ్యం గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మిఠాయి దుకాణాల నుంచి బియ్యం తెచ్చినట్లు శ్రీనివాసరావు అంగీకరించారని అధికారులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డెప్యూటీ తహసీల్దార్ ప్రదాన్ చెప్పారు.

పోరంకి సెంటర్‌లో పొంచి ఉన్న ప్రమాదం



పెనమలూరు: పోరంకి సెంటర్‌లో నిడమానూరు రోడ్డు నుంచి బందరు రోడ్డు మలుపులో డ్రెయినేజీపై ఉన్న సిమెంట్ (మూత) శ్లాబ్ విరిగి ప్రమాదంగా ఉంది. సీఎం పర్యటన ఉందని ఇటీవల సిమెంట్ శ్లాబ్ వేశారు. భారీ వాహనం వెళ్లడంతో డ్రెయినేజీపై ఉన్న నాణ్యత లేని సిమెంట్ మూత విరిగి పైకి లేచి ప్రమాదకరంగా మారింది. రాత్రి సమయాల్లో ఎవరైనా చూడక పోతే నేరుగా రెండు మీటర్ల లోతులో ఉన్న డ్రెయినేజీలో పడి గాయపడే ప్రమాదం పొంచి ఉంది. స్థానికులు భయంతో రాకపోకలు సాగిస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కార్నియాల సేకరణ

కంకిపాడు: కంకిపాడుకు చెందిన లయన్స్ ప్రతినిధి రేకపల్లి సత్యనారాయణ అలియాస్ డిపో స్వామి శనివారం తెల్లవారుఝామున మృతి చెందారు. ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు శంకర నేత్రాలయకు దానం చేశారు. ఆస్పత్రి ప్రతినిధులు కార్నియాలను సేకరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కంకిపాడు ప్రతినిధులు చవట శంకర్‌రావు, మద్దుల యుగంధర్ తదితరులు పాల్గొన్నారు. నేత్రదానానికి అంగీకరించిన కుటుంబ సభ్యులను పలువురు అభినందించారు.

వల్లభనేని వంశీకి మాజీ మంత్రులు కొడాలి, పేర్ని పరామర్శ



వల్లభనేని వంశీని పరామర్శిస్తున్న మాజీ మంత్రులు కొడాలి, పేర్ని

హనుమాన్‌జంక్షన్ రూరల్: అక్రమ కేసుల్లో అరెస్ట్ అయి 140 రోజుల పాటు నిర్బంధంలో ఉన్న వైఎస్సార్ సీపీ నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌ను మాజీ మంత్రులు కొడాలి నాని, పేర్ని నాని శనివారం పరామర్శించారు. బాపులపాడు మండలం ఎ.సీతారామపురంలో ప్రస్తుతం నివాసం ఉంటున్న వంశీ వద్దకు ఇరువురు నేతలు వచ్చారు. జైలులో పలుమార్లు అనారోగ్యానికి గురికావడంతో వంశీ యోగక్షేమాలను వారు అడిగి తెలుసుకున్నారు.

అధ్వానంగా రామచంద్రాపురం రహదారి



గన్నవరం రూరల్: మండలంలోని సూరంపల్లి గ్రామ శివారు రామచంద్రాపురంలో రహదారులు అధ్వానంగా ఉన్నాయి. వర్షం నీరు రోడ్లపై నిలిచిఉండటంతో బురదగా మారాయి. ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఉండటంతో భారీ వాహనాలు నిరంతరం తిరుగుతుంటాయి. కార్మికులు వందలాది మంది ఈ పరిశ్రమల్లో పనులు చేస్తున్నారు. ద్విచక్ర వాహనాలు పడిపోయి వాహనదారులు గాయాలపాలవుతున్నారు. సూరంపల్లి నుంచి నున్న వెళ్లేందుకు ఈ రహదారి దగ్గర మార్గం కావడంతో వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని రైతులు, కార్మికులు కోరుతున్నారు.

వాటర్ ట్యాంకులు శుభ్రం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం నిడమానూరులో శనివారం వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించారు. గ్రామంలోని నాలుగు వాటర్ ట్యాంకులను పారిశుద్ధ్య సిబ్బందితో శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి నరసింహారావు మాట్లాడుతూ గ్రామంలో సురక్షిత తాగునీటి సరఫరాకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో పంచాయతీ కుళాయిల ద్వారా తాగునీరు అందిస్తున్నామని, కాల్వగట్టు ప్రాంతాల్లో మోటారు బోర్ల సహాయంతో నీరు అందిస్తున్నామని చెప్పారు. తాగునీటి సరఫరాలో, పబ్లిక్ కుళాయిల వద్ద ఏమైనా సమస్యలు ఉంటే పంచాయతీ కార్యాలయంలో నేరుగా ఫిర్యాదు చేయాలని సూచించారు.

ప్రభుత్వ భవనాలపై వైఎస్ జగన్ చిత్రపటాల తొలగింపు



నున్న హెల్త్ సెంటర్లో జగన్ చిత్రపటం తొలగించిన ప్రదేశం



రైతు సేవా కేంద్రం వద్ద..

విజయవాడరూరల్: కూటమి ప్రభుత్వం మరో కుట్రకు తెరలేపింది. ప్రభుత్వ కార్యాలయ భవనాలపై ఉన్న మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటాలను తొలగిస్తోంది. విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలోని ప్రభుత్వాస్పత్రి భవనంపై ఉన్న వైఎస్ జగన్ చిత్ర పటాలను, పెయింట్‌తో వేసిన బొమ్మలను శనివారం ఉదయం ఆస్పత్రి సిబ్బంది విధులకు హాజరుకాక ముందే పంచాయతీ సిబ్బంది తొలగించారు. గ్రామ సచివాలయం, రైతు సేవా కేంద్రం వద్ద ఉన్న బొమ్మలను సైతం తీసివేశారు. దీనిపై వైఎస్సార్ సీపీ నాయకులు ప్రశ్నించగా ప్రభుత్వ ఆదేశాల మేరకే తొలగించామని వారు సమాధానమిచ్చారు.

ఎన్నికల నిబంధనలపై అవగాహన



బీఎల్వోలకు అవగాహన కల్పిస్తున్న ఎన్నికల అధికారులు

గన్నవరం: ఎన్నికల నియమ నిబంధనలపై బూత్ లెవల్ అధికారులు అవగాహన కలిగి ఉండాలని గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గ ఎలక్ట్రోల్ అధికారి టి. శివరామప్రసాద్ అన్నారు. ఎన్నికల విధి విధానాలపై స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్‌లో శనివారం నుంచి ఈ నెల 16 వరకు జరగనున్న నియోజకవర్గ స్థాయి మాస్టర్స్ ట్రైనర్స్, బీఎల్వోలకు అవగాహన సదస్సు ప్రారంభమైంది. ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాల తయారీలో బీఎల్వోల పాత్ర కీలకమైనదన్నారు. ఈ నెల 9 నుంచి జరగనున్న ఓటర్ల జాబితా మార్పులు, చేర్పులు, తొలగింపు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని చెప్పారు. 80 ఏళ్లు దాటిన ఓటర్ల వివరాలను తప్పనిసారిగా సేకరించాలని సూచించారు. తహసీల్దార్ కట్ట వెంకటశివయ్య, ఎన్నికల డెప్యూటీ తహసీల్దార్ లక్ష్మీనాంచారమ్మ, ఉంగుటూరు డెప్యూటీ తహసీల్దార్ చిట్టిబాబు, మాస్టర్ ట్రైనర్లు నవీన్, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా జగన్నాథ రథయాత్ర



కానూరులో సాగుతున్న జగన్నాథ రథయాత్ర

పెనమలూరు: ఇస్కాన్ జగన్నాథ్ మందిర్ ఆధ్వర్యంలో కానూరు గ్రామంలో శనివారం జగన్నాథ రథయాత్ర కనుల పండువగా సాగింది. భక్తులు తన్మయత్వంతో రథయాత్రలో పాల్గొని భక్తిపారవశ్యం చెందారు. మందిర అధ్యక్షుడు చక్రదారి దాస్ ప్రోత్సాహంతో జగన్నాథ, బలదేవ, సుభద్ర మహారాణిల విగ్రహాలను ప్రత్యేకంగా అలకరించి రథంలో ఉంచి గ్రామ వీధుల్లో రథయాత్ర జరిపించారు. కానూరు శ్రీ సాయి గీతా మందిరం నుంచి ప్రారంభమైన యాత్రను సిద్ధార్థ కళాశాల వైస్ చాన్సలర్, ప్రొఫెసర్ పరుచూరి వెంకటేశ్వరరావు, ప్రొఫెసర్ వెంకట రత్నప్రసాద్ పాల్గొన్నారు. చక్రధారి దాస్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ విజయవాడ ఇస్కాన్ ఆధ్వర్యంలో చేపట్టిన జగన్నాథ రథయాత్ర వైభవంగా సాగుతోందన్నారు. ఈ సందర్భంగా గౌరాంగి, హర్షిణి, సహర్ష సంప్రదాయ భరత నాట్య ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. రథయాత్ర కానూరు పంట కాలువ రోడ్డు, నాగార్జున హాస్పిటల్స్ మీదుగా సాగింది. వేలాదిమంది భక్తులు రథయాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బలరాం గోవింద దాస్, వ్రజధామ్ దాస్, శ్రీకాంత్ నరసింహ దాస్, శ్యాం సుందర్ అచ్యుత దాస్, భక్తులు పాల్గొన్నారు.

ఏపీ ఎన్‌జీఓ కంకిపాడు యూనిట్ అసోసియేట్ అధ్యక్షుడిగా బసవయ్య



బసవయ్యను సత్కరిస్తున్న కంకిపాడు ప్రతినిధులు

కంకిపాడు: ఏపీ ఎన్‌జీఓ కంకిపాడు తాలూకా యూనిట్ అసోసియేట్ అధ్యక్షుడిగా కంకిపాడు మండల పరిషత్ ఏఓ నిమ్మగడ్డ బసవయ్య ఎంపికయ్యారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అసోసియేషన్ కార్యవర్గ ప్రతినిధుల భర్తీ చేపట్టారు. ఉపాధ్యక్షుడిగా షేక్ నవాబ్ (స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్), సహాయ కార్యదర్శిగా ఎండీ షమియుల్లాహ్ (రెవెన్యూ) ఎన్నికయ్యారు. అనంతరం వెస్ట్ కృష్ణా అధ్యక్షుడు డి.సత్యనారాయణరెడ్డి, కార్యదర్శి పి.రమేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి రమణ ఎంపీఎంఎ (ఎం)లో పర్మినెంట్ అయిన వారికి సభ్యత్వాలు అందజేశారు. ఉయ్యూరు అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, ప్రతినిధులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



కంకిపాడు: నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని కడప జిల్లా డీఎస్పీ ఎస్.కమలాకర్ అన్నారు. ఈడుపుగల్లు నలంద విద్యా నికేతన్‌లో శనివారం ఇన్‌వెస్టిట్యూర్ సెర్మనీ కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ పి.నాగలక్ష్మి ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో డీఎస్పీ కమలాకర్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం అవసరమన్నారు. కేవలం చదువులోనే కాకుండా అన్ని రంగాల్లోనూ రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. స్కూల్ హెడ్ బాయ్, హెడ్ గర్ల్‌గా ఎంపికైన పలువురు విద్యార్థులకు మెడల్స్ అందించి అభినందించారు. కార్యక్రమంలో విద్యా సంస్థల సీఏఓ ఎల్.సుధారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక, సాహసోపేత కార్యక్రమాలు అలరించాయి.

లోక్‌అదాలత్‌లో 152 కేసులు పరిష్కారం



గన్నవరం: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గన్నవరంలోని కోర్టుల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ లోక్ అదాలత్‌లో మొత్తం ఎనిమిది సివిల్ కేసులు, మరో 139 రాజీ పడదగిన క్రిమినల్ కేసులను పరిష్కరించామని అధికారులు తెలిపారు. అదే విధంగా ఐదు ప్రీ లిటిగేషన్ పరిష్కరించామని చెప్పారు. మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, సబ్‌కోర్టు జడ్జి డాక్టర్ ఎస్. అరుణశ్రీ, ఇతర జడ్జిలు, సేవాధికార సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరుని హుండీ ఆదాయం రూ. 6.87 లక్షలు

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలోని రామలింగేశ్వరస్వామి దేవస్థానం ఆలయ హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఆలయంలోని తొమ్మిది హుండీలను దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సుజన్‌కుమార్ పర్యవేక్షణలో లెక్కించారు. ఈ ఏడాది మార్చి 6 నుంచి జూలై 4వ తేదీ వరకూ భక్తులు సమర్పించిన కానుకల ద్వారా ఆలయానికి రూ. 6,87,615 ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు.

ప్రభుత్వ స్థలంలో ఏటీఎం ఏర్పాటు

కూటమి పాలనలో పరాకాష్టకు చేరిన ఆక్రమణలు



ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన ఏటీఎం, పాల బూత్

పెనమలూరు: కూటమి పాలనలో ప్రభుత్వ స్థలం కనబడితే కబ్జా చేస్తున్నారు. ఏకంగా నేషనల్ హైవేకు చెందిన స్థలంలో ఏటీఎం, పాలబూత్ ఏర్పాటు చేసి దందా చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారి విస్తరణ సమయంలో కానూరు కేసీపీ కాలనీ ఎదురుగా బందరు కాలువ కట్టపై ఉన్న ఆక్రమణలను తొలగించి బాధితులకు ప్రభుత్వం పరిహారం ఇచ్చింది. ఈ ప్రాంతంలో ఆక్రమణలు జరగకుండా గత ప్రభుత్వం గ్రీనరీ పెంచింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎన్‌హెచ్ఐ స్థలంలో ప్రైవేటు రైతు బజార్ ఏర్పాటు చేశారు. అంతటితో ఆగకుండా ప్రభుత్వ స్థలంలో ఏటీఎం, పాల బూత్ కూడా పెట్టారు. రైతుల ముసుగులో రైతు బజార్ పెట్టి టీడీపీ నేతలు ఆక్రమిస్తే ఇప్పుడు ఏటీఎం, పాలబూత్ కూడా పెట్టి వసూళ్ల దందా చేస్తున్నారు. ఈ ప్రాంతంలో మరిన్ని ఆక్రమణలకు ప్రైవేటు వ్యక్తులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రభుత్వం పరిహారం ఇచ్చి గతంలో ఆక్రమణలు తొలగిస్తే మరలా టీడీపీ నేతలు అదే స్థలాన్ని ఆక్రమించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దుచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నేత చంద్రపాల్

కంకిపాడు: లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేసి కార్మిక సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా నేత టి.చంద్రపాల్ అన్నారు. ఈనెల 9న చేపట్టిన దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ కంకిపాడులోని మండేపూడి భవన్‌లో శనివారం ప్రజా సంఘాల ప్రతినిధులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. చంద్రపాల్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వంలో అమలులోకి తెస్తున్న లేబర్ కోడ్‌ల ద్వారా కార్మిక వ్యవస్థ చిన్నాభిన్నం అవుతోందన్నారు. హక్కులను కోల్పోతుందని చెప్పారు. కార్మిక వర్గ సంక్షేమానికి ప్రమాదకరంగా మారిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ. 26 వేలు అందించాలని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేసే యోచన విరమించుకోవాలని కోరుతూ చేపట్టిన సమ్మెలో కార్మికవర్గం భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ప్రజాసంఘాల ప్రతినిధులు టి. నరేష్, వి.శివశంకర్, వి.రమేష్, కె.నాంచారయ్య, జి.చంటి, ఆదిలక్ష్మి, సంధ్య, నళినీకుమారి, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి..

కంకిపాడు: పాలకులు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు పిలుపునిచ్చారు. పట్టణంలోని సంఘ కార్యాలయంలో కౌలు రైతులు, రైతు సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 9న చేపట్టిన దేశ వ్యాప్త సమ్మె సన్నాహక సమావేశం శనివారం నిర్వహించారు. హరిబాబు మాట్లాడుతూ పెట్టుబడిదారులకు లాభాలు చేకూర్చేలా కేంద్రంలో పాలకుల తీరు ఉందన్నారు. పోరాటల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసేలా పాలకులు విధానాలను అవలంభిస్తున్నారని విమర్శించారు. రైతులు, కౌలురైతుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ ఆందోళనలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం, కౌలు రైతు సంఘాల జిల్లా ప్రతినిధులు సీహెచ్ శ్రీహరి, వి.జాన్‌మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకారోత్సవం



విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న రుకేష్ తదితరులు

గన్నవరం: స్థానిక మీఎస్ సెయింట్‌జాన్స్ మాధ్యమికోన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నూతనంగా ఎన్నికైన పాఠశాల, కళాశాల బాలుర నాయకులు ఎ. నవీన్, ప్రణయ్‌కుమార్, బాలికల నాయకులు తనిష్క, డెన్నిశ్రీ, తరగతుల వారీగా క్యాబినెట్ విద్యార్థులతో పాఠశాల పూర్వ విద్యార్థి మండవ రుకేష్ ప్రమాణ స్వీకారం చేయించారు. పాఠశాల డైరెక్టర్ రెవ. బ్రదర్ బాలశౌరి మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే ప్రతి ఒక్కరు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని చెప్పారు. ఈ దిశగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ప్రతి ఏటా ఎన్నికలు నిర్వహించి బాల, బాలికలకు నాయకత్వ బాధ్యతలను అప్పగిస్తున్నామన్నారు. తద్వారా రానున్న కాలంలో దేశాన్ని నడిపించే ఉత్తమ నాయకులుగా ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థులను చదువుకే పరిమితం చేయకుండా వారి ఆసక్తికి అనుగుణంగా క్రీడా, సాంస్కృతి, సేవా రంగాల్లో ప్రోత్సాహిస్తున్నామని చెప్పారు. పూర్వ విద్యార్థులు డాక్టర్ బూరగడ్డ దినేష్, కె. వాసుదేవ్, ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్ కుమార్, సీనియర్ బ్రదర్ జిమ్మికురియోకోస్, బ్రదర్ సీజే థామస్, బ్రదర్ భల్లా జోసఫ్, బ్రదర్ జయబాలన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్

గన్నవరం: ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా స్థానిక బుద్ధవరం రోడ్డులోని ఎన్టీఆర్ పశు వైద్య కళాశాలకు చెందిన క్లినికల్ కాంప్లెక్స్‌లో ఆదివారం పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబీస్ టీకాలు వేస్తామని అసోసియేట్ డీన్ డాక్టర్ పీవీఎస్ కిశోర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉచిత రేబీస్ టీకాల వేస్తామని, పెంపుడు కుక్కల యాజమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పెంపుడు కుక్కలకు ఉచితంగా రెబీస్ వ్యాధి నిరోధక టీకాలను వేస్తామని పశుసంవర్ధక శాఖ బాపులపాడు ఏడీ డాక్టర్ ఎం.ప్రమీలారాణి శనివారం తెలిపారు. స్థానిక ఐటీఐ రోడ్డులోని ప్రభుత్వ పశువైద్యశాలలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి టీకా పంపిణీ జరుగుతుందన్నారు.

ఘనంగా కోడి రామ్మూర్తి నాయుడు జయంతి



రామ్మూర్తినాయుడు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రతినిధులు

పెనమలూరు: ఇండియన్ హెర్క్యులెస్ కోడి రామ్మూర్తి నాయుడు జయంతి వేడుకలు కానూరు గ్రామంలోని అశోక్ జిమ్ సెంటర్‌లో శనివారం నిర్వహించారు. రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి యూత్ సర్వీసెస్ ఏఓ వి.రఘురాం, సీపీఓ సీనియర్ అసిస్టెంట్ పి.నాగేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తాళ్లూరి అశోక్, అశోక్ జిమ్ క్రీడాకారులు పాల్గొన్నారు.